ఐక్య ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులుగా కె.సురేష్ కుమార్

- యుటిఎఫ్ రాష్ట్ర కుటుంబ సంక్షేమ డైరెక్టర్‌గా యుఆర్‌ఎ.రవికుమార్

కె.సురేష్ కుమార్

రవి కుమార్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కాకినాడలో జరిగిన యుటిఎఫ్ రాష్ట్ర 17వ విద్యా వైజ్ఞానిక మహాసభల్లో కర్నూలు జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు కె.సురేష్ కుమార్ ఐక్య ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారి ప్రభాకర వర్మ ప్రకటించినట్లు జిల్లా నాయకులు తెలిపారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగానూ అలాగే ఐక్య ఉపాధ్యాయ పత్రిక చీఫ్ ఎడిటర్‌గా కె.సురేష్ కుమార్ కొనసాగన్నారు. అలాగే యుటిఎఫ్ కర్నూలు జిల్లా అధ్యక్షులుగా బాధ్యతల్లో ఉన్న యుఆర్‌ఏ రవికుమార్‌ను యుటిఎఫ్ రాష్ట్ర కుటుంబ సంక్షేమ సంఘం డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీలో జిల్లా నాయకత్వానికి ప్రాధాన్యం ఇవ్వడం పట్ల హర్షం ప్రకటిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటీ ఉపాధ్యక్షులు జి.హేమంత్ కుమార్, సీనియర్ నాయకులు ఎస్ఎం జయరాజు, యెహెూషువాలు తెలిపారు.

వలసలను నిరోధించండి

- పశ్చిమ ప్రాంత గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించాలి
- ఎంఎస్ఎంఈ సర్వే పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోని పశ్చిమ ప్రాంతాల్లో ఉపాధి కూలీల వలసలను నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో సమావేశాలు పెట్టి ఉపాధి హామీ పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కలెక్టర్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల్లో ఇంకా 67 శాతం అర్జీలను పరిష్కరించాల్సి ఉందని, వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. రీ సర్వేకి సంబంధించి 10 వేల అర్జీలను గడువులోపు పరిష్కరించాలని చెప్పారు. వచ్చిన అర్జీలను కేటగిరీ వారీగా విభజించుకొని నిబంధనల ప్రకారం వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఫ్రీ హెూల్డ్ భూములకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వెరిఫికేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత తహసీల్దాం లను ఆదేశించారు. కృష్ణగిరి, దేవనకొండ, మద్దికెర మండలాల్లో వెరిఫికేషన్ ప్రక్రియ ఎక్కువగా పెండింగ్‌లో ఉందని, ఎందుకు జాప్యం అవుతోందని సంబంధిత తహశీల్దార్‌లను ప్రశ్నించారు.. దేవనకొండ తహశీల్దార్, మద్దికెర తహశీల్దార్‌లు వీడియోకాన్ఫరెన్స్ సమావేశానికి హాజరు కాకపోవడంతో వారు రేపు కలెక్టరేట్‌కు రావాలని పత్తికొండ ఆర్డీఓను ఆదేశించారు. జిల్లాలో ఈ నెల 10, 11, 12వ తేదీల్లో గోకులం ప్రారంభోత్సవాలను నిర్వహించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో 370 గోకులంలకు గాను ఇప్పటివరకు 268 గోకులాలు పూర్తయ్యాయని, పెండింగ్లో ఉన్న గోకులాలను కూడా ఒకటి రెండు రోజుల్లో పూర్తి చేయాలని డ్వామా పీడిని ఆదేశించారు. పంచాయతీరాజ్ అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనులకు సంబంధించి పల్లె పండుగలో శాంక్షన్ చేసిన 830 పనులకు గాను ఇప్పటివరకు 764 పనులు పూర్తి అయ్యాయని, మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పంచాయతీ రాజ్ శాఖ అధికారులను కలెక్టర్ అభినందించారు. ఎంఎస్ఎంఈ సర్వేను ఫిబ్రవరి 1వ తేది నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్, ఎంపిడిఒలను ఆదేశించారు. తాగు నీటి ట్యాంకులను శుభ్రపరచడంలో 97 శాతం, క్లోరినేషన్ చేసే ప్రక్రియలో 87 శాతం సాధించారని, ఈ అంశాలపై నిర్లక్ష్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ రాక

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ గురువారం ఓర్వకల్లు సోలార్ హబ్ పరిశీలనకు రానున్నారు. ఉదయం 11 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుండి బయలుదేరి 11:45 గంటలకు కర్నూలు విమానాశ్రయం చేరుకుంటారు. ఓర్వకల్లు విమానాశ్రయం నుండి ఉదయం 11:50 గంటలకు హెలిక్యాప్టర్‌లో బయలుదేరి గని సోలార్ పార్క్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు సైట్‌ను ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించి మధ్యాహ్నం 12:30 గంటలకు అప్పర్ రిజర్వాయర్ దగ్గర ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అప్పర్ రిజర్వాయర్ హెలిప్యాడ్ నుండి రోడ్డు మార్గాన బయలుదేరి మ.12:40 గం.లకు అప్పర్ ఇంటెక్ వ్యూ పాయింట్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 12:40 గంటల నుండి 1:15 వరకు ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తారు. 1:15కు అప్పర్ ఇన్‌టెక్ వ్యూ పాయింట్ నుండి రోడ్డు మార్గాన బయలుదేరి 1:25కు పవర్ హౌస్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి 1:40 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 1:45కు టిఆర్‌సి వ్యూ పాయింట్ చేరుకుంటారు. 2 గంటలకు టిఆర్సి వ్యూ పాయింట్ నుండి రోడ్డు మార్గాన బయలుదేరి 2:15కు వసతి గృహం చేరుకుంటారు. మధ్యాహ్నం 3:30 గంటలకు గెస్ట్ హౌస్ నుండి రోడ్డు మార్గాన బయలుదేరి గెస్ట్ హౌస్ బి-3 బ్లాక్ చేరుకుంటారు. 3:35 నుండి సాయంత్రం 4:05 గంటల వరకు సంబంధిత అధికారులు ఉప ముఖ్యమంత్రికి ప్రజెంటేషన్ ద్వారా ప్రాజెక్ట్ వివరాలను వివరిస్తారు. అనంతరం 4:05 గంటలకు బి3 బ్లాక్ నుండి అప్పర్ ఇన్‌టెక్ వ్యూ పాయింట్‌కు బయలుదేరి 4:20కు చేరుకుంటారు. సాయంత్రం 4:25 గంటలకు హెలిక్యాప్టర్ ద్వారా బయలుదేరి 4:50కు కర్నూలు విమానాశ్రయం చేరుకుంటారు. 4:55 గంటలకు కర్నూలు విమానాశ్రయం నుండి గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరి వెళ్తారు.

నేడు మంత్రి నారా లోకేష్ పర్యటన

రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటి, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ మంత్రి నారా లోకేష్ గురువారం రాత్రి కర్నూల్‌కు రానున్నారు. మంత్రి నారా లోకేష్ రాత్రి 9 గంటలకు అనతరపురం నుండి రోడ్డు మార్గాన బయలుదేరి 11 గంటలకు కర్నూలు రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహం చేరుకొని బస చేస్తారు. 10వ తేది శుక్రవారం ఉదయం 9 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి నగరంలోని పలు కళాశాలలను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుండి 1 గంట వరకు ఎస్ఎపి గ్రౌండ్స్ చేరుకొని రాష్ట్ర పరిశ్రమల, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టిజి.భరత్ కుమార్తె రిసెప్షన్ వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం ఎస్ఎపి గ్రౌండ్ నుండి రోడ్డు మార్గాన 1:30 గంటలకు కర్నూలు విమానాశ్రయం చేరుకుని హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్తారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు కిరణ్ కుమార్

108ను ప్రభుత్వమే నిర్వహించాలి

- 108 ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కిరణ్ కుమార్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

108 వ్యవస్థను ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని 108 ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు నగరంలోని కార్మిక కర్షక భవన్‌లో 108 ఎంప్లాయిస్ యూనియన్ కర్నూలు జిల్లా అధ్యక్షులు రాజేష్ రెడ్డి అధ్యక్షతన ఉమ్మడి కర్నూలు జిల్లా 108 ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కిరణ్ కుమార్ మాట్లాడుతూ 108 వ్యవస్థను మరింత ప్రతిష్ట పరచాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం 108 ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేసే ఆందోళనలపై ఎస్మా ప్రయోగించాలని ప్రయత్నించిం దని, అయినప్పటికీ ఉద్యోగుల ఐక్యమత్యంతో అనేక డిమాండ్లను సాధించుకున్నా మని తెలిపారు. వేతనం 4 వేల రూపాయలు అదనంగా సాధించుకున్నామని చెప్పారు. అలాగే భవిష్యత్తులో పిఆర్‌సి పెరిగినప్పుడల్లా కాంట్రాక్టు ఉద్యోగులకు జీతం పెరిగితే 108 ఉద్యోగులకు కూడా జీతం పెరిగే విధంగా అగ్రిమెంట్ చేసు కున్నట్లు తెలిపారు. రాబోవు కాలంలో ఉద్యోగులు ఐక్యమత్యంగా పోరాడి మరిన్ని హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం 108 ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు నరసింహ, రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు, రాష్ట్ర ట్రెజరర్ శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.గౌస్ దేశాయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు తదితరులు ప్రసంగించారు. ఈ సమావేశంలో 108 ఉద్యోగుల సంఘం నాయకులు మహేష్, పార్థసారథి, రాజశేఖర్ రెడ్డి, జీవన్, ఉమ్మడి జిల్లా 108 ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

చిన్న వ్యాపారస్తులను వేధించడం తగదు

- చిన్న వ్యాపారస్తుల సంఘం, సిఐటియు
- గుత్తి పెట్రోల్ బంకు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద చిన్న వ్యాపారస్తుల ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

చిరు వ్యాపారస్తులను మున్సిపల్ అధికారులు వేధించడం తగదని చిన్న వ్యాపారస్తుల సంఘం న్యూ సిటీ కార్యదర్శి మహమ్మద్ రఫీ, సిఐటియు న్యూ సిటీ కార్యదర్శి సిహెచ్ సాయి బాబా అన్నారు. బుధవారం నగరంలోని గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో చిన్న వ్యాపారస్తులతో కలిసి సిఐటియు నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, అధికారంలోకి వచ్చిన టిడిపి నాయకులు 6 లక్షల 6 వేలకు ఎక్కువ టెండర్లు వేసి చిన్న వ్యాపారస్తులపై బండికి రూ.500 అని చెప్పేసి బెదిరిస్తూ, మున్సిపల్ అధికారులు బండ్లను తొలగించమని బలవంతం చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి ఏసు, నాయకులు లక్ష్మయ్య, చిన్న వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు న్యూ సిటీ కార్యదర్శి సిహెచ్ సాయిబాబా

శునకాలకు పకడ్బందీగా శస్త్ర చికిత్సలు

- భారత జంతు సంక్షేమ మండలి సభ్యులు అంజలి గోపాలన్
- గార్గేయపురం డంప్‌యార్డులో సంతాన నిరోధక శస్త్ర చికిత్స కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

వీధి కుక్కల సంతాన నిరోధక శస్త్ర చికిత్స కేంద్రాన్ని ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బంధీగా నిర్వహించాలని భారత జంతు సంక్షేమ మండలి సభ్యులు అంజలి గోపాలన్ నగరపాలక అధికారులకు సూచించారు. శునకాల సంతాన నిరోధక శస్త్ర చికిత్స కేంద్రం నిర్వహణకు సంబంధించి అనుమతుల కోసం నగరపాలక, భారత జంతు సంక్షేమ మండలికి ధరకాస్తు చేసుకుంది. అందులో భాగంగా భారత జంతు సంక్షేమ మండలి సభ్యురాలు బుధవారం కర్నూలు నగరానికి వచ్చారు. నగర శివారు గార్గేయపురం డంప్‌యార్డులోని శునకాల సంతాన నిరోధక శస్త్ర చికిత్స కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఆమెకు నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె కేంద్రంలో ఉన్న శస్త్ర చికిత్స గదులు, శునకాల బోను, తదితర సౌకర్యాలను పరిశీలించారు. నగరంలో శస్త్ర చికిత్సలు జరిగిన, ఇంకా జరగాల్సిన శునకాల సంఖ్య, కేంద్రంలో శునకాలకు అందించే ఆహారం, శస్త్ర చికిత్సలు నిర్వహించే పద్ధతులు, వంటి వివరాలపై అంజలి గోపాలన్ ఆరా తీశారు. నగర శివారున విశాలమైన ఆహ్లాదకరమైన ప్రదేశంలో కేంద్రం ఏర్పాటు చేయడంపై ఆమె అధికారులను ప్రశంసించారు. శునకాలకు సంతాన నియంత్రణ క్షేత్ర చికిత్సలను పున ప్రారంభించేందుకు, నవోదయ సొసైటీకి ప్రాజెక్ట్ రికగ్నేషన్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు అంజలి గోపాలన్ సానుకూలంగా స్పందించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ నగరంలో కుక్కల బెడద నివారణకు త్వరలోనే సంతాన నియంత్రణ శస్త్ర చికిత్సలను తిరిగి ప్రారంభిస్తామన్నారు. తొలుత ప్రతిరోజు సామర్థ్యం ఉన్న 20 శునకాలకు శస్త్ర చికిత్సలను నిర్వహిస్తామని, మరో 12 శునకాలకు శస్త్ర చికిత్సలకు సంబంధించిన కేంద్ర నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. నగరంలో ఇప్పటికే 10,054 శునకాలకు శస్త్ర చికిత్సలు జరిగాయని, ఇంకా 4 వేలకు పైగా శునకాలకు చేయాల్సి ఉందన్నారు. ఒక్కొక్క శునకం శస్త్ర చికిత్సకు నగరపాలక సంస్థ రూ.1500 లు ఖర్చు చేస్తుందన్నారు. అనంతరం అంజలి గోపాలన్, అధికారులతో కలిసి కేంద్రం బయట మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆరోగ్యధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, వెటర్నరీ డాక్టర్ మల్దన్న, ఏఈ వైష్ణవి, నవోదయ సొసైటీ అధ్యక్షుడు గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

శునకాల సంతాన నిరోధక శస్త్ర చికిత్స కేంద్రం వద్ద అంజలి గోపాలన్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

డీఎస్సీ నోటిఫికేషన్, జాబ్ క్యాలెండర్‌పై
మంత్రి లోకేష్ స్పష్టమైన హామీ ఇవ్వాలి

- డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, జాబ్ క్యాలెండర్‌పై స్పష్టమైన హామీ ఇవ్వాలని డివైఎఫ్ఐ నాయకులు రాష్ట్ర విద్యాశాఖ, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌ను డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్, జిల్లా సహాయ కార్యదర్శి హుస్సేన్ బాష, జిల్లా నాయకులు రంగప్ప, నగర నాయకులు మల్లేష్ మాట్లాడారు. వైసిపి ప్రభుత్వము నిరుద్యోగులను మోసం చేసిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వెంటనే రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని.. ఉద్యోగాలిచ్చే వరకు నిరుద్యోగ భృతి ఇస్తామని.. డీఎస్సీపై కూటమి ప్రభుత్వం మొదటి సంతకం చేసిందని చెప్పారు. జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి ఇప్పటిదాకా విడుదల చేయలేదని విమర్శించారు. కర్నూలు జిల్లాకు వస్తున్న మంత్రి లోకేష్ డీఎస్సీ నోటిఫికేషన్‌పై, జాబ్ క్యాలెండర్‌పై, నిరుద్యోగ భృతిపై స్పష్టమైన వైఖరిని తెలియజేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే నిరుద్యోగుల ఆగ్రహానికి ఈ ప్రభుత్వం గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

తాండ్రపాడులో రెవెన్యూ సదస్సు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్



అర్జీలను స్వీకరిస్తున్న అధికారులు, నాయకులు

కర్నూలు మండలం బి.తాండ్రపాడు గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డికె.వెంకటేశులు ఆధ్వర్యంలో అధికారులు గ్రామంలో భూ సమస్యలకు సంబంధించిన పలు వినతులను స్వీకరించారు. సర్పంచి ఆకెపోగు జయన్న, కర్నూలు రూరల్ డిప్యూటీ తహశీల్దార్ శివప్రసాద్, విఆర్ఒ గిడ్డయ్య, సర్వేయర్ ఫాజిల్ హుస్సేన్ పాల్గొన్నారు.

శ్రీశైలం ఇఒను కలిసిన విజయకుమార్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

శ్రీశైలం దేవస్థానం ఇఒ శ్రీనివాస్‌ను ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ స్టేట్ డైరెక్టర్ పాలకవీటి విజయకుమార్ బుధవారం శ్రీశైలం దేవస్థానంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇఒతో నాయీ బ్రాహ్మణుల సమస్యలపై చర్చించారు. సుబ్బయ్య, రామచంద్రుడు, బాల హుస్సేనయ్య, రామ్మోహన్, కిట్టు, అశోక్, ఈశ్వర్, బాలు పాల్గొన్నారు.

18 ఏళ్లుగా నిరుపయోగంగా నీళ్ల ట్యాంకు

- పిపిఎస్ఎస్ నాయకులు, కాలనీవాసులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలో గల బాలాజీ నగర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు పంచాయత్ రాజ్ శాఖ నీళ్ల ట్యాంకు నిర్మించి 18 ఏళ్లు గడుస్తోందని, అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని బాలాజీ నగర్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు ఎం.మాణిక్య రెడ్డి, సహాయ కార్యదర్శి ఎస్.లతీఫ్ బాష, న్యాయవాది ఎం.రవికుమార్ విమర్శించారు. బుధవారం పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ ప్రాంతంలో రోజు విడిచి రోజు తాగునీరు వదులుతున్నారని, నీళ్ల ట్యాంకు కనెక్షన్ ఇచ్చి రోజూ తాగునీరు సరఫరా చేయాలని పలు శాఖల అధికారుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులుండే బాలాజీ నగర్‌కు ప్రత్యేక గుర్తింపు ఉన్నప్పటికీ ఈ ప్రాంతం నిర్లక్ష్యానికి గురవుతూనే ఉందని తెలిపారు. నీళ్ల ట్యాంకు పరిసర ప్రాంతం శ్మశానాన్ని తలపించేలా తయారైందని చెప్పారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల దాదాపు రూ.50 లక్షల విలువైన నీళ్ల ట్యాంకు నిరుపయోగంగా ఉందన్నారు. ట్యాంకుకు కనెక్షన్ ఇచ్చి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. బాలాజీ నగర్ సొసైటీ నాయకులు కె.మోహన్ రావు, సహాయ కార్యదర్శి మధు కుమార్, సలహాదారులు ఈ.లింగారెడ్డి, ఎంసి.పుల్లయ్య, పిపిఎస్ఎస్ నాయకులు మహ్మద్ యూనుస్, సివి.వర్మ, ఎస్ఆర్.గౌడ్, కె.శీను పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఉన్న ట్యాంకును పరిశీలిస్తున్న నాయకులు

'కూటమి'తోనే అభివృద్ధి : టిడిపి

ప్రజాశక్తి - పత్తికొండ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని తేరు బజార్‌లో ఉన్న పెద్ద మసీదు నుంచి పెద్దమ్మ గుడి వరకు సిసి రోడ్డు నిర్మాణానికి సాంబశివారెడ్డి, సర్పంచి కొమ్ము దీపిక భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మూడు దశాబ్దాల నుంచి తేరు బజారులోని పెద్ద మసీదు నుంచి పెద్దమ్మ గుడి వరకు సిసి రహదారి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలోనే వీరబ్రహ్మేంద్రస్వామి తిరుణాల సందర్భంగా జాతరకు పలు రకాల దుకాణాలు ఏర్పాటు చేసుకుంటారని, అలాంటి ప్రాంతంలో రహదారి లేక ప్రజలు ఇబ్బందులు పడేవారని చెప్పారు. ఇక్కడ సిసి రహదారి, సైడ్ కాలువలను నిర్మించాలని ఎమ్మెల్యే కెఇ.శ్యామ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నిధులను కేటాయించినట్లు చెప్పారు. ఎమ్మెల్యే కెఇ.శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో పత్తికొండ పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. టిడిపి నాయకులు అడ్వకేట్ సురేష్ కుమార్, పంచాయతీ రాజ్ వెంకటేశ్వర్లు, కాంట్రాక్టర్ దశరథ రామిరెడ్డి పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న నాయకులు

పింఛనుదారుల జాబితాపై సర్వేలు ముమ్మరం

ప్రజాశక్తి - సిబెళగల్

మండలంలో పింఛను లబ్ధిదారుల జాబితాపై ప్రొఫెసర్లు కిరణ్ కుమార్, పద్మజ బుధవారం సర్వేలు ముమ్మరం చేశారు. వయస్సు నిర్ధారణ లేకున్నా, అర్హులు కానీ వారు పింఛను తీసుకుంటున్న జాబితా తయారు చేస్తున్నట్లు వారు తెలిపారు. నకిలీ ధ్రువ పత్రాలు పొందిన వారు కూడా పింఛనుకు అనర్హులని, స్వచ్ఛందంగా పింఛను వద్దని రాసిస్తే మంచిదని తెలిపారు. ఈ సర్వేలకు పింఛనుదారులు సహకరించాలని కోరారు. ఎంపిడిఒ రాణెమ్మ పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు మోడల్ పేపర్ పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - మద్దికెర

పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా మోడల్ పేపర్ పుస్తకాలను పంపిణీ చేసినట్లు ఎంఇఒ రంగస్వామి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రముఖ దాత విఆర్.యాదవ్ ఎపి మోడల్ స్కూల్ పదో తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్ పుస్తకాలు విరాళంగా ఇచ్చినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు పుస్తకాలను వివేకంతో సద్వినియోగం చేసుకొని పబ్లిక్ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత తీసుకురావాలని కోరారు. ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సవిత, యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగరాజు, మండల అధ్యక్షులు రంగన్న, ఆర్థిక కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

పుస్తకాలను పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

ఫ్లూ లక్షణాల్లాంటివే.. హెచ్ఎంపివి

- డాక్టర్ మురార్జీ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

హెచ్ఎంపివి వైరస్ లక్షణాలు కూడా ఫ్లూ, ఇతర శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల మాదిరిగానే ఉంటాయని మెడికవర్ హాస్పిటల్స్ డాక్టర్ ఆర్.మురార్జీ కన్సల్టెంట్ పీడియాటిక్, డాక్టర్ కమ్మర వినోద్ ఆచారి కన్సల్టెంట్ పలమనాలజిస్ట్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడారు. దగ్గు, జ్వరం, ముక్కుకారడం, గొంతునొప్పి, సాధారణ లక్షణాలు కలిగి ఉంటాయని తెలిపారు. పిల్లలు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు, కీమోథెరపీ చేయించుకునే వారిలో తీవ్రత ఎక్కువగా ఉంటుందని చెప్పారు. నిమోనియా, రక్తంలో ఆక్సిజన్ శాతం తగ్గిపోవడం వంటి ఇబ్బందులను కలుగజేస్తుందని తెలిపారు. ఇది దగ్గడం, తుమ్మడం వల్ల వెదజల్లే తుంపర్ల వల్ల వ్యాప్తి చెందుతుందని చెప్పారు. చేతులను తరచూ శుభ్రం చేసుకోవడం, దగ్గేటప్పుడు, తుమ్మేటప్పుడు ముక్కు, నోటిని కవర్ చేసుకోవాలని, రద్దీ ప్రదేశాలకు వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మాస్కులు ధరించాలని సూచించారు. అనంతరం మెడికవర్ హాస్పిటల్స్ కర్నూలు క్లస్టర్ హెడ్ డాక్టర్ వై.మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... పిల్లలు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎవరైనా ఇలాంటి సమస్యతో బాధపడుతూ కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అనుభవజ్ఞులైన వైద్యులతో మెడికవర్ హాస్పిటల్స్ 24/7 అందుబాటులో ఉందని తెలిపారు.

మాట్లాడుతున్న వైద్యులు

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

తాగునీటి సమస్యను పరిష్కరించకపోతే ఉద్యమాలు

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు నారాయణ

ప్రజాశక్తి - గూడూరు

పట్టణంలో నిలిచిపోయిన నాలుగు ఓవర్ హెడ్ ట్యాంకుల పనులను వెంటనే పూర్తి చేసి పట్టణ ప్రజలకు తాగునీటి సమస్యను పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమాలు చేపడతామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కెవి.నారాయణ హెచ్చరించారు. బుధవారం గూడూరులోని సిఐటియు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సిపిఎం ప్రాంతీయ కమిటీ సభ్యులు రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడారు. పట్టణాన్ని మున్సిపాలిటీగా చేశారు తప్ప ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదని, రూ.54 కోట్లతో నిర్మాణంలో ఉన్న నాలుగు ఓవర్ హెడ్ ట్యాంకులను పూర్తి చేసి ప్రజలకు తాగునీరు అందించాలని కోరారు. పట్టణంలో 80 శాతం మంది ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. పట్టణంలో తాగునీటి ఎద్దడి ఉందని, రాబోయే వేసవిలో సమస్య తీవ్రంగా ఉంటుందని తెలిపారు. పట్టణ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారం చూడడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం నిలిచిపోయిన నాలుగు ట్యాంకులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి జె.మోహన్, ప్రాంతీయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, ఇబ్రహీం, కోటేశ్వరయ్య, పార్టీ సభ్యులు మద్దిలేటి, మధు పాల్గొన్నారు.

కాల్వ బుగ్గ అభివృద్ధికి ప్రణాళిక

- టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కాల్వబుగ్గ రామేశ్వర దేవాలయ అభివృద్ధికి ప్రణాళికను రూపొందించాలని టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్ దేవదాయ అధికారులను ఆదేశించారు. బుధవారం కాల్వబుగ్గ రామేశ్వర దేవాలయాన్ని మల్లెల రాజశేఖర్, టిడిపి మండల సీనియర్ నాయకులు సిఎస్.సుధాకర్ రెడ్డి, హుస్సేనాపురం వాటర్ సెట్ కమిటీ ఛైర్మన్ చంద్ర పెద్ద స్వామితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాల్వబుగ్గ దేవాలయ అభివృద్ధికి సహకరించాలని టిటిడి బోర్డు ఛైర్మన్‌కు నివేదించినట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో భక్తులకు ఇక్కడ అన్ని సౌకర్యాలూ కల్పించనున్నట్లు తెలిపారు. ఇఒ మద్దిలేటి, జూనియర్ అసిస్టెంట్ గోవింద్ రెడ్డి ఉన్నారు.

దేవాలయాన్ని పరిశీలిస్తున్న రాజశేఖర్, అధికారులు

ఉపాధి పనులను ఉపయోగించుకోవాలి

- డ్వామా పీడీ వెంకట రమణయ్య



గ్రామస్తులతో మాట్లాడుతున్న పీడీ వెంకటరమణయ్య

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఉపాధి హామీ చట్టం కింద చేపట్టే పనులను గ్రామాల్లో ప్రజలు వినియోగించుకొని వలసలు వెళ్లకుండా స్థానికంగా ఉపాధి పొందాలని డ్వామా పీడీ వెంకటరమణయ్య తెలిపారు. బుధవారం మండలంలోని చిన్నమరివీడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో వ్యవసాయ కూలీలతో ఏపీడీ అలీ పీరన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... ఉపాధి హామీ చట్టం ద్వారా వంద రోజుల పని దినాలను కూలీలందరూ వినియోగించుకోవాలన్నారు. కూలీలకు దినసరి కనీస వేతనం రూ.300 అందే విధంగా పనులు చేయించాలని సిబ్బందికి సూచించారు. గ్రామస్తులు వలసలు వెళ్లి ఇబ్బందులకు గురికాకుండా స్థానికంగా ఉండే ఉపాధి పనులను ఉపయోగించుకోవాలని తెలిపారు. తమకు వ్యవసాయ పనిముట్లు అందజేయాలని కూలీలు పీడీని కోరారు. ఎంపిడిఒ మణిమంజరి, ఎపిఒ మహ్మద్ బాష, ఈసీ ఉస్మాన్, డిఎఫ్‌టి చిట్టెమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ వీరేష్ పాల్గొన్నారు.

చేనేతలకు అండగా కూటమి ప్రభుత్వం

- ఎమ్మెల్యే బీవీ

నూలు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని తేరుబజారులో చేనేత కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం నూలు పాస్ పుస్తకాలు, విద్యుత్ చార్జీల రాయితీ గుర్తింపు పత్రాలను అందజేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హ్యాండ్లూమ్స్ నాగరాజు, అప్పాజీ, ఎడిఒ పెద్దయ్య పాల్గొన్నారు.

మైనార్టీ కాలనీ సమస్యలు పరిష్కరిస్తాం

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమ్మ

సమస్యలు తెలుసుకుంటున్న గుడిసె ఆది కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

పట్టణ శివారులో ఉన్న మైనార్టీ కాలనీలో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ హామీ ఇచ్చారు. పట్టణ శివారులో టిజిఎల్ కాలనీ సమీపంలో ఉన్న ముస్లిం, మైనారిటీ కాలనీలో బుధవారం ఆమె పర్యటించారు. సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైయినేజీ సదుపాయం లేదని, వీధి లైట్లు వెలగడం లేదని స్థానికులు ఆమె దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కాలనీ ఏర్పడి 25 ఏళ్ళు గడిచినా రోడ్లు, డ్రైయినేజీ మౌలిక సదుపాయాలు కల్పించడంలో గత పాలకులు వైఫల్యం చెందారని విమర్శించారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి దృష్టికి తీసుకెళ్లి అతి త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మురుగునీటి కాలువలు, రోడ్లు కావాలని కాలనీ మహిళలు డిమాండ్ చేశారు. కాలువలు లేకపోవడం వల్ల ఎక్కడికక్కడే మురుగునీరు నిలిచి అనేక రోగాల బారిన పడుతున్నామని ఆమె దృష్టికి తెచ్చారు. ఉర్దూ పాఠశాలకు భవనం, అంగన్వాడీ సెంటర్ ప్రత్యేకంగా కావాలని ఆవాజ్ కమిటీ పట్టణ కార్యదర్శి ఇక్బాల్ ఆమె దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామని కృష్ణమ్మ హామీఇచ్చారు.

'ఏం అడిగినా సమాచారం ఉండాలి'

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వానికి కావాల్సిన సమాచారం ఏం అడిగినా అధికారుల వద్ద ఉండేటట్లు చూసుకోవాలని ఎంపిడిఒ అల్లా బకాష్, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ తెలిపారు. బుధవారం మండల కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం వారు మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలు పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు మన వద్ద ఉంటే ప్రభుత్వం అడిగినప్పుడు పూర్తి వివరాలను అందించేందుకు వెసలుబాటు ఉంటుందన్నారు. అధికారులు అలసత్వంగా ఉండి ప్రభుత్వం సమాచారం అడిగితే ఇవ్వలేకపోతే నోటీసులు ఇచ్చే వరకు తెచ్చుకోకూడదని తెలిపారు. అర్హత లేని వారు పింఛన్లు పొందుతున్నారని, అలాంటి వారుంటే వారి వివరాలను తెలుసుకునే బాధ్యత సచివాలయ అధికారులపై ఉందన్నారు. పరిపాలన అధికారి శ్రీనివాసులు, ఇఒఆర్‌డి బాలన్న, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మల్లికార్జున రెడ్డి, ఎపిఒ జుబేర్ అహ్మద్, హౌసింగ్ అధికారులు భవ్య, కృష్ణ కుమార్ పాల్గొన్నారు.

సాదాసీదాగా మున్సిపల్ వార్షిక బడ్జెట్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు మున్సిపల్ కౌన్సిల్ వార్షిక బడ్జెట్ సమావేశం సాదాసీదాగా సాగింది. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ రఘు సమావేశం నిర్వహించారు. ముందుగా కౌన్సిల్ ఇసాక్ భార్య మృతి చెందడంతో ఆమె మృతికి సంతాపం తెలిపారు. 2024-25 సంవత్సరం సవరణ బడ్జెట్ అంచనాలు 2025-26 సంవత్సరం బడ్జెట్ అంచనాలు, సంవత్సర అదాయం, ప్రభుత్వం నుంచి ప్రతేడా వచ్చే గ్రాంట్లు, తదితర పద్దుల డిమాండ్‌పై సుమారు 95 శాతం, మరికొన్ని పద్దులపై 100 శాతం వసూలైనవి పరిగణనలోకి తీసుకుని అంచనా రాబడి, ఖర్చుల విషయంలో సమావేశం నిర్వహించారు. బడ్జెట్ అంచనాలను కౌన్సిల్ ఆమోదం తెలిపింది. 2025-26 సంవత్సరపు సాధారణ ఖర్చు రూ.14,83,95,000, మూలధనం ఖర్చు రూ.14,16,20,000 రుణాలు చెల్లింపులతో కలిపి మొత్తం ఖర్చు రూ.29,40,15,000గా, ముగింపు నిల్వగా రూ.42,80,51,856తో అంచనాలు తయారు చేయగా, 2024-25 సంవత్సరపు సవరించిన బడ్జెట్ అంచనాలు 2025-26 సంవత్సరపు బడ్జెట్ అంచనాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్‌పై కౌన్సిలర్లు ఏకాభిప్రాయం తెలిపారని మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్ తెలిపారు. కౌన్సిలర్ దయాసాగర్ మాట్లాడుతూ... బడ్జెట్ సమావేశాల్లో గతేడాది కంటే ఫైనాన్షియల్ అదనంగా 15 శాతం కేటాయించినట్లు, ఎస్సీ సబ్ ప్లాన్‌కు రూ.300 కోట్లు, శిశు సంక్షేమానికి రూ.కోటి కేటాయించినట్లు తెలిపారు. వార్డుల్లో కుంటుపడిన అభివృద్ధి పనులు, నీటి పైపులైన్లు, రోడ్డు నిర్మాణాలు, పాడైన బోరుబావుల స్థానంలో కొత్తగా బోరు బావుల మరమ్మతులు చేపట్టాలని వైసిపి వార్డు కౌన్సిలర్ కేశవ రెడ్డి, నాగశేషప్ప, శివ ప్రసాద్ కోరారు. వీధుల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని, వాటిని నియంత్రించాలని కౌన్సిలర్ నాగశేషప్ప తెలిపారు.

సంతాపం తెలుపుతున్న కౌన్సిలర్లు

జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి

తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఎమ్మెల్యే విరుపాక్షి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అందరూ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉండి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని జగన్‌మోహన్ రెడ్డి సూచించారన్నారు. ప్రభుత్వ లోటుపాట్లను గమనించి ఎప్పటికప్పుడు నిరసనల ద్వారా ప్రభుత్వానికి తెలియజేయాలని సూచించారని తెలిపారు.

భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలి : తహశీల్దార్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

భూ సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని తహశీల్దార్ శేషఫణి సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని కోటేకల్ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మాజీ ఎంపిపి శంకరయ్య హాజరయ్యారు. అధికారులు రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆర్ఐ లక్ష్మన్న, ఈరన్న, విఆర్ఒ నాగేంద్రమ్మ, ఇబ్రహీం పాల్గొన్నారు.

తూకాలను పరిశీలిస్తున్న అధికారులు

రైతులను దగా చేసిన వ్యాపారికి జరిమానా

ప్రజాశక్తి - ఆస్పరి

రైతులు ఆరుకాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్మకానికి తీసుకు రాగ తూకాల్లో మోసాలకు పాల్పడిన వ్యాపారికి బుధవారం తూనికల శాఖ అధికారులు రూ.50 వేల జరిమానా విధించారు. జొహరాపురం గ్రామానికి చెందిన రంజాన్ కందుల వ్యాపారం చేస్తున్నారు. క్వింటాకు 3 కిలోలో బాజీ తీసుకుంటూ మోసానికి పాల్పడుతున్నాడన్న విషయం తెలుసుకున్న తూనికల శాఖ సిఐ శ్రీనివాసులు వ్యాపారి తూకం వేస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తూకాల్లో మోసాలకు పాల్పడినందుకు రూ.50 వేలు జరిమానా విధించారు. ఇలాగే ఇంకోసారి తూకాల్లో మోసాలకు పాల్పడితే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పీఠాధిపతులకు డ్రై ఫ్రూట్స్‌తో తులాభారం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థులకు భక్తులు డ్రై ఫ్రూట్స్‌తో తులాభారం నిర్వహించారు. బుధవారం స్థానిక శ్రీమఠం ఆవరణలో త్రాసులో పీఠాధిపతులను ఆశీనులు చేసి మరోవైపు డ్రై ఫ్రూట్స్‌తో తూచి ఆయనకు సమానంగా తూచిన డ్రై ఫ్రూట్స్‌ను శ్రీమఠానికి అందజేశారు. కర్ణాటక రాష్ట్రం శిరుగుప్పకు చెందిన ఆర్యవైశ్య పాదయాత్ర సమితి ఆధ్వర్యంలో 4న ఉదయం 5 గంటలకు చేపట్టి సుమారు వంద కిలోమీటర్ల ప్రయాణించి 6న సాయంత్రం 6 గంటలకు మంత్రాలయం చేరుకున్నారు. వారు రెండు రోజుల పాటు శ్రీమఠంలో శ్రీరాఘవేంద్ర అష్టాక్షర హోమం నిర్వహించి 26 కోట్ల శ్రీరాఘవేంద్ర అష్టాక్షర పారాయణం పూర్తి చేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు పాదయాత్ర భక్తులందరికీ అనుగ్రహ ఫలాలు, మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు.

తులాభారం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

ఎస్సీ సర్టిఫికెట్లు జారీ చేయాలి

- మాదాసి/మాదారి కురువ రిజర్వేషన్ పరిరక్షణ సమితి

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఆలూరు

కురువ అని పిలవబడే మాదాసి/మాదారి కురువలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని మాదాసి/మాదారి కురువ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆలూరు తాలూకా కన్వీనర్ కౌడికి రాజు కోరారు. బుధవారం రాజు ఆధ్వర్యంలో తహశీల్దార్ గోవిందు సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ... ఎస్సీ జాబితాలో ఉన్న 59 ఉపకులాలకు ఒక్కో ఆచార, వ్యవహారాలు ఉంటాయని, ఒక కులాన్ని ఇంకో కులంతో పోల్చుకోకూడదని తెలిపారు. మాదాసి/మాదారి కురువలు గొర్రెలు, మేకలు మేపుకుంటూ సంచారం చేస్తూ ఎక్కడ పచ్చిక గడ్డి ఉందో అక్కడ అడవుల్లో కుటుంబానికి దూరంగా నెలల తరబడి ఉండేవారని చెప్పారు. సంచార జాతిగా తమను ఎస్సీ జాబితాలో పొందుపరిచారని, ఎస్సీ సోదరులు గమనించాలని తెలిపారు. సంఘం గౌరవాధ్యక్షులు రంగన్న, మండల అధ్యక్షులు టీచర్ శ్రీనివాసులు, రమేష్, మల్లయ్య పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులు

'ప్రతిభ'లో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - కౌతాళం

సంక్రాంతి సంబరాల్లో భాగంగా పట్టణంలోని ప్రతిభ హైస్కూల్‌లో బుధవారం బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన బాలికలను మెడల్, ప్రశంసా పత్రాలతో అభినందించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాష మాట్లాడారు. విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాల ప్రతిరూపమే పండగలని, ఇలాంటి పండగలను పట్టణ ప్రాంతాల కన్నా గ్రామీణ ప్రాంతాల్లో చూడముచ్చటగా జరుపుకుంటారని తెలిపారు. ఇలాంటి పండగ వాతావరణాన్ని విద్యార్థులకు తెలియజేస్తూ బాలికలకు ప్రత్యేక ముగ్గుల పోటీలను నిర్వహించి ప్రోత్సహించినట్లు చెప్పారు. విద్యార్థులు విద్యా బుద్ధులతోపాటు మన పద్ధతులు, సంస్కృతి, సాంప్రదాయాల వైపు దృష్టి సారించాలని సూచించారు.

పశుగణనను సక్రమంగా చేపట్టాలి

- ఎడి సుబ్రమణ్య ఆచారి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

పశుగణనను సక్రమంగా చేపట్టాలని ఎడి సుబ్రమణ్య ఆచారి తెలిపారు. బుధవారం మండలంలోని కోటేకల్లు పంచాయతీలో పశువుల ఆస్పత్రిని ఎడి సుబ్రమణ్య ఆచారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మిగనూరు, నందవరం పరిధిలో ఎమ్మిగనూరు అర్బన్, ఎమ్మిగనూరు మండలం, నందవరం మండలాల్లోని అన్ని గ్రామాల్లోనూ పశువులను హౌస్ హోల్డ్‌కు సంబంధించిన ఎన్ని ఉన్నాయి, హౌస్ హోల్డ్ లేని పశువులను గుర్తించాలని తెలిపారు. వాటిని రికార్డు చేయాలని పశు వైద్యాధికారి డాక్టర్ వెంకట్ నరేంద్రకు సూచించారు. ఆస్పత్రిలో ఉన్న మౌలిక సదుపాయాల గురించి తెలుసుకున్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎడి

రాష్ట్రస్థాయి పోటీలకు హత్తి బెళగల్ విద్యార్థి

ప్రజాశక్తి - ఆలూరు

రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు హత్తి బెళగల్ జడ్పి హైస్కూల్ విద్యార్థి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు శివప్రసాద్ తెలిపారు. ఆలూరులోని కెవికె స్టేడియంలో ఈనెల 7న జిల్లాస్థాయి సెపక్ తక్రా ఎంపిక పోటీలు జరిగాయి. హత్తి బెళగల్ విద్యార్థి కె.రియాజ్ ఎంపికయ్యాడని తెలిపారు. ఈనెల 17, 18న ప్రకాశం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. బుధవారం విద్యార్థిని ఉపాధ్యాయులు ఉషారాణి, శంకరయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు చిన్నబాబు అభినందించారు.

11న విజయవాడలో డిటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న విద్యా, ఉపాధ్యాయ రంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 11న విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహిస్తున్నట్లు డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కరె కృష్ణ, జిల్లా అధ్యక్షులు వెంకటరాముడు, జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప తెలిపారు. బుధవారం కర్నూలులోని డిటిఎఫ్ కార్యాలయంలో ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. రాష్ట్ర కౌన్సిలర్ గోట్ల చంద్రశేఖర్, జిల్లా, మండల బాధ్యులు పాటిల్ ఈశ్వర్ రెడ్డి, జగదీష్, రవీంద్ర, వీరేష్, వెంకటాచలం, సోమశేఖర్ పాల్గొన్నారు.

పరారైన దొంగ అరెస్టు

ప్రజాశక్తి - ఆదోని

పోలీసుల కళ్లుగప్పి పరారైన దొంగను అరెస్టు చేశామని టూ టౌన్ సిఐ సూర్య మోహన్ రావు తెలిపారు. బుధవారం టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో నిందితుడు మురళీని మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దొంగతనం కేసులో ఇటీవలే అరెస్టు చేసి కోర్టులో ప్రవేశ పెట్టేందుకు వెళ్లే సమయంలో కళ్లుగప్పి సోమవారం తప్పించుకున్నాడని తెలిపారు. అరెస్టు చేయాలని డీఎస్పీ సోమన్న ఆదేశాలతో పోలీసులు పరశురాం, నరసింహులు గాలింపు చేపట్టారని చెప్పారు. దొంగ నివాస ప్రాంతమైన వేంబే కాలనీ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణమయ్యారని, అక్కడ మారు వేశంలో వెళ్లి దొంగ ఆచూకీ కనుగొన్నారని తెలిపారు. హైదరాబాద్‌లోని వెంబే కాలనీలో కాపు కాయగా పోలీసులను చూసి పారిపోతుండగా 250 మీటర్లు వెంటపడి పట్టుకున్నట్లు చెప్పారు. పోలీసుల చాకచక్యాన్ని పలువురు అభినందించారు.

మీడియా ముందు ప్రవేశపెట్టిన సిఐ సూర్య మోహన్ రావు

జొహరాపురం, వెంకాయపల్లె రోడ్డు వేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని 19వ వార్డు జొహరాపురం నుంచి వెంకాయపల్లి వరకు రోడ్డు వేయాలని సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, నగర కార్యదర్శి వర్గసభ్యులు ఎం.రామాంజనేయులు, ఎస్ఎండి.షరీఫ్, అబ్దుల్ దేశాయ్, రామకృష్ణ కోరారు. బుధవారం వారు మాట్లాడారు. కళాశాలలకు, ఆస్పత్రులకు వెళ్లేవారు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని తెలిపారు. ఈ రోడ్డు గుంతలమయమైందని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారులు అనేక సార్లు కింద పడి కాలు, చేతులు విరిగిన సంఘటనలు అనేకం ఉన్నాయని తెలిపారు. నగరపాలక సంస్థ, ఆర్అండ్‌బి అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

శ్రీనివాసులును కలిసిన ఎన్‌జిఒ సభ్యులు

ప్రజాశక్తి - తుగ్గలి

కర్నూలు జిల్లా సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎపిసి టి.శ్రీనివాసులును సమగ్ర శిక్ష ప్రత్యామ్నాయ పాఠశాలల సమన్వయకర్త సురేష్ రాజ్, ఎన్‌జిఒ సభ్యులు బుధవారం కలిశారు. తుగ్గలి మండలం బొందిమాడుగుల సర్పంచి సలహా దారులు ఎస్.ప్రతాప్ యాదవ్, రఘు, శేఖర్, శివ శంకర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.

చిన్నారులు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలి

- గైనకాలజిస్టు డాక్టర్ కల్పన

ప్రజాశక్తి - పత్తికొండ

హెచ్‌ఎంపివి వైరస్ పట్ల చిన్నారులు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని పత్తికొండ గైనకాలజిస్ట్ డాక్టర్ కల్పన సూచించారు. బుధవారం ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గైనకాలజిస్ట్ డాక్టర్ కల్పన మాట్లాడారు. జ్వరం, దగ్గు, ముక్కు కారడం, గొంతు నొప్పి ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. చిన్నారులు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువ ఉన్న వారిలో హెచ్‌ఎంపివి వైరస్ అనారోగ్యానికి దారి తీస్తుందని తెలిపారు. చేతులను తరచుగా కడుక్కోవాలని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో తిరిగేటప్పుడు మాస్కులు తప్పనిసరిగా వాడాలని అన్నారు.

ప్రణాళికబద్ధంగా చదివాలి

- డిప్యూటీ డిఇఒ వెంకటరమణారెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

ప్రణాళికబద్ధంగా చదివి పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలని డిప్యూటీ డిఇఒ వెంకట రమణారెడ్డి సూచించారు. బుధవారం ఎస్‌టియు ఆధ్వర్యంలో రూపొందించిన పదో తరగతి అధ్యయన సామగ్రిని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో దాతలు నాగరాజు స్వామి, బీచుపల్లి సహకారంతో డిప్యూటీ డీఈఓ వెంకటరమణ రెడ్డి, ఎంఇఒలు జి.రాజేంద్రప్రసాద్, పి.శ్రీనివాసులు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 350 మందికి మెటీరియల్‌ను ఎస్‌టియు నాయకులు ఉచితంగా అందించేందుకు ముందుకు రావడం హర్షణీయమని తెలిపారు. నాయకులు సి.నాగరాజు, వి.రమేష్ నాయుడు, జి.వీరచంద్ర యాదవ్ మాట్లాడుతూ... సాధారణ విద్యార్థులు కూడా ఉత్తీర్ణత పొందే విధంగా పాఠ్యపుస్తకంలోని ముఖ్యమైన భావనలతో స్టడీ మెటీరియల్‌ను రూపొందించినట్లు తెలిపారు. విద్యార్థులు ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలను సాధించాలని సూచించారు. నాయకులు లోక్య నాయక్, రవి, భీమరాజు, సత్యనారాయణ, ప్రహ్లాద, సుధాకర్, రాజా సతీష్, ప్రసాద్, జయరాం, వెంకటరామిరెడ్డి, నాగేంద్ర గౌడ్ ఉన్నారు.

మెటీరియల్ పంపిణీ చేస్తున్న విద్యాధికారులు

కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

'11న ధర్నాను జయప్రదం చేయండి'

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఉపాధ్యాయుల సమస్యలపై ఈనెల 11న విజయవాడలోని అలంకార్ సెంటర్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప కోరారు. బుధవారం మండలంలోని హెచ్.కైరవాడి జడ్‌పి హైస్కూల్ ఆవరణలో కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని ఉపాధ్యాయ సంఘాలను చర్చలకు ఆహ్వానించాలని, విద్యారంగం పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న అశాస్త్రీయ విధానాలను వీడనాడాలని కోరారు. మాతృభాష మాధ్యమాలను సమాంతర బోధనా మాధ్యమంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు అన్ని రకాల ప్రమోషన్లు చేపట్టాల న్నారు. ధర్నాలో ఉపాధ్యాయులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఎస్ఎఫ్ఐ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కమిటీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను వైస్ ఛాన్సిలర్ ఎన్‌టికె.నాయక్, రిజిస్ట్రార్ విజయ్ కుమార్ నాయుడు బుధవారం ఆవిష్కరించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, రీసెర్చ్ డైరెక్టర్ విశ్వనాథ రెడ్డి, పరీక్షల డీన్ సుందరానంద్ పుచ్చా, పరీక్షల నిర్వహణ అధికారి వెంకటేశ్వర్లు, లైబ్రరీ ఇన్‌ఛార్జీ నాగభూషణంతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడారు. యూనివర్సిటీలోని సమస్యలు తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని ఎస్ఎఫ్ఐ నాయకులకు తెలిపారు. ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ, కోకన్వీనర్ మౌలాలి, యూనివర్సిటీ నాన్ టీచింగ్ అసోసియేషన్ సుంకన్న, రమేష్, చిరంజీవి పాల్గొన్నారు.

ఎస్టీ పునరుద్ధరణకు పోరాటం

- బివిఎస్ రాష్ట్ర అధ్యక్షులు అంజి వాల్మీకి

ప్రజాశక్తి - తుగ్గలి

ఎస్టీ పునరుద్ధరణకు నిరంతరం పోరాటం చేయాలని బివిఎస్ రాష్ట్ర అధ్యక్షులు తలారి మారెళ్ల అంజి తెలిపారు. బుధవారం బొత్తిరాళ్ల గ్రామంలో బోయ/వాల్మీకి సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. శివరాజ్ నాయుడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అంజి మాట్లాడారు. రాష్ట్రంలో బోయ/వాల్మీకులు విద్య, ఉద్యోగాల్లో వెనుకబడి ఉన్నారని, భూమి లేక వృత్తి లేక వాల్మీకులు పూర్తిగా వెనుకబాటు పట్టారని తెలిపారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వాల్మీకులకు న్యాయం చేస్తుందని, ఇచ్చిన మాట నిలబెట్టుకుని ఎస్టీ పునరుద్ధరణ చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. బివిఎస్ పత్తికొండ నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు మహేందర్ నాయుడు, వివి.నాయుడు, మాదన్న, చంద్ర, మహేష్, హనుమాన్న పాల్గొన్నారు.

సాంప్రదాయాలను గౌరవిద్దాం

- లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ గోపీనాథ్

ప్రజాశక్తి - ఆదోని

పండగల ప్రాముఖ్యతను చాటి.. సాంప్రదాయాలను గౌరవించడం అలవర్చుకోవాలని లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ గోపీనాథ్ తెలిపారు. లయన్స్ క్లబ్, అవోపా, వామ్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను స్థానిక ప్రభుత్వ గట్టు బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఇందులో దాదాపు 50 మంది విద్యార్థులు చక్కటి రంగవల్లులు వేసి అలరించారు. ప్రతిభ చూపిన విద్యార్థినులు రాజేశ్వరి, భవాని, సాయి భవిత, ఉషారాణి, అంజలికి బుధవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంక్రాంతి అంటే అందరికీ గుర్తుకొచ్చేది ముగ్గులని తెలిపారు. లయన్స్ క్లబ్ ఛైర్మన్ ప్రసాదరావు, అధ్యక్షులు ధర్మారెడ్డి, కార్యదర్శి శ్రీనాథ్ గుప్తా, విశిష్ట సభ్యులు వనపరాజు, ఓం ప్రకాష్, అవోపా తరఫున రఘు, ఈరన్న శెట్టి, మమత, డాక్టర్ రంజిత్, వెంకటేశ్వర్లు, శ్రీదేవి, అనూష, సంతోష్ ఉన్నారు.

బాలికలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

భూ మాఫియా సూత్రధారులు ఎక్కడ..?

- మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని భూ మాఫియా పాత్రధారులు దొరికారు.. మరి సూత్రధారులు ఎక్కడ అని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ ప్రశ్నించారు. బుధవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదోనిలో తరచుగా జరుగుతున్న భూ మాఫియా వ్యవహారంలో పాత్రధారుల తీగలాగి సూత్రధారుల డొంకను ప్రభుత్వ అధికారులు కదిలించాలని కోరారు. భూ మాఫియా వల్ల ఆదోనికి చాలా చెడ్డ పేరు రావడంతో పాటు వ్యాపారంగా కొన్ని రూ.వందల కోట్లు నష్టపోతుండడం బాధాకరమని వాపోయారు. ఇది ఆదోని పేద, మధ్యతరగతి వర్గాల వారి ఆర్థిక వ్యవహారాలపై తీరని ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం ఆషామాషీగా తీసుకోకుండా కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఆదోనిలో ఈనెల 4న వెలుగులోకి వచ్చిన రూ.40 కోట్ల విలువైన భూకబ్జాతో అందరూ ఆశ్చర్యపోయారని చెప్పారు. అక్రమ రిజిస్ట్రేషన్‌కు యత్నించిన వారిని గట్టిగా విచారించి వారి కాల్ డేటా, ఇతర వివరాలతో ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు సూత్రధారులను కూడా కటకటాల వెనక్కి పంపాలని పోలీసు శాఖ ఉన్నతాధికారులను కోరారు. లేకపోతే ఆదోని మార్కెట్ కోలుకోవడం కష్టమని, ఇది సామాన్యుల జీవన ప్రమాణాలను భారీగా దెబ్బతీయబోతోందని తెలిపారు. అప్రమత్తంగా వ్యవహరించి ఆదోని బ్రాండ్‌ను కాపాడాలని కోరారు.

వెంకటేష్‌కు మార్కెట్ యార్డు ఛైర్మన్ ఇవ్వాలి

- మాజీ ఎంపిపి రత్నమ్మ

తలారి వెంకటేష్

ప్రజాశక్తి - ఆస్పరి

ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవిని బిల్లేకల్లు తలారి వెంకటేష్‌కు ఇవ్వాలని మాజీ ఎంపిపి రత్నమ్మ, సొసైటీ మాజీ డైరెక్టర్ కృష్ణ యాదవ్, నాయకులు జీవన్ కుమార్, రాజశేఖర్ కోరారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. బిల్లేకల్లు వెంకటేష్ ఆస్పరి మండలంలో టిడిపి అభివృద్ధికి కృషి చేశారని, సామాజిక సేవా కార్యక్రమాలతో రాజకీయాల్లోకి వచ్చి ఎన్నో పదవులు చేపట్టారని తెలిపారు. 1990 నుంచి 2000 వరకు విద్యా కమిటీ ఛైర్మన్‌గా పని చేశారన్నారు. వెంకటేష్ 2001 నుంచి 2006 వరకు బిల్లేకల్లు సర్పంచిగా పని చేశారని, 2006లో ఎంపిపి జనరల్‌కు కేటాయించగా ఎస్సీ కోటాలో ఎంపిపి పదవిని చేజిక్కించుకోవడం ఆయన రాజకీయ చాణిక్యతకు నిదర్శనమని తెలిపారు. 2012 నుంచి 2021 వరకు టిడిపి మండల కన్వీనర్‌గా పని చేశారన్నారు. 2013 నుంచి 2018 వరకు వెంకటేష్ భార్య తలారి సంజమ్మ సర్పంచిగా పని చేశారన్నారు. పార్టీ అధికారంలో లేనప్పటికీ 2021లో జరిగిన స్థానిక సంస్థ ఎన్నికల్లో తలారి కిష్టయ్యను జడ్‌పిటిసిగా, కోడలు హేమీమాను ఎంపిటిసిగా పోటీ చేయించారని తెలిపారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు ఆయనపై కక్ష కట్టి అక్రమ కేసులు బనాయించి రెండు సార్లు జైలుకు పంపారని చెప్పారు. బిల్లేకల్లు గ్రామంలో మార్కెట్ ఏర్పాటు చేయడానికి ఎంతో కృషి చేశారన్నారు. అలారుదిన్నె నుంచి ఏడు కిలోమీటర్లు పైపులైను ఏర్పాటు చేసి బిల్లేకల్లు, అట్టేకల్లు గ్రామాలకు తాగునీటి వసతి కల్పించారని తెలిపారు. 1999 నుంచి నేటి వరకు పార్టీలో కొనసాగుతూ ఎన్నో పదవులు పొందారన్నారు. ప్రస్తుతం ఆయన పార్టీ జిల్లా సెక్రటరీగా పని చేస్తున్నారని చెప్పారు. అధిష్టానం ఆయన సేవలను గుర్తించి మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవిని ఇవ్వాలని కోరారు.

గడ్డివామి దగ్ధం

- యువత స్పందనతో తప్పిన పెను ప్రమాదం

మంటలను ఆర్పేస్తున్న సిబ్బంది, యువకులు

ప్రజాశక్తి - కౌతాళం

పట్టణంలో మంటలు వ్యాపించి గడ్డివామి దగ్ధమైంది. కౌతాళం ఎస్సీ కాలనీ సమీపంలో సుమారు 50కి పైగానే గడ్డివాములు ఉన్నాయి. బుధవారం అకస్మాత్తుగా తప్పిడి మల్లికార్జునకు చెందిన గడ్డివామిలో మంటలు వ్యాపించడంతో చుట్టుపక్కల ఉన్న యువత పరుగులు పెట్టారు. సర్పంచి పాల్ దినకరన్, టిడిపి నాయకులు వెంకట పతి రాజు సహకారంతో ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకొచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను పూర్తిగా అదుపు చేశారు. యువకులు స్పందించడంతో సుమారు 50 గడ్డివాములు కాలి పోకుండా రక్షించడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) ADONI
I.P.No.06/2024

Katike Ibrahim. ...Petitioner
Vs
B.Thayanna & 27 others. ...Respondents

GENERAL NOTICE

Whereas the above named petitioner filed petition under Section 10 of Provincial Insolvency Act to declare the petitioner as insolvent. Hence anybody has got any wants any objection with regard to the above petition are hereby appear before this court on 20.01.2025 at 10.30 AM and answer the said petition and also anybody wants any objection to appear before this court, otherwise the petition will be decided exparte.

(By court order)

K. Nabi Rasool,
Advocate,
D.No.15/9, Katike Street,
Yemmiganur 518 360
Kurnool District.